# భారత్, పాక్ సంబంధాలు- ప్రతిబంధకాలు

**భారత్, పాకిస్థాన్ ఈ రెండిటి మధ్య దాయాది పోరు దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. వీటి మధ్య స్నేహ వారధిని నిర్మించేందుకు చేస్తున్న యత్నాలన్నీ విఫలమవుతూనే ఉన్నాయి. దశాబ్దాల కాశ్మీర్ వివాదం మొదలు.. గత ఏడాది ముంబై దాడుల వరకు ఇరు దేశాల మధ్య ఎన్నో ఉద్విగ్నభరిత సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్ని చర్చలు జరిగినా అవి వృథా ప్రయాసే అయ్యాయి. తాజాగా చర్చల ప్రక్రియ పునఃప్రారంభానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో.. భారత్- పాక్ మధ్య ప్రధాన ప్రతిబంధకాలపై విశ్లేషణ.**

భారత్-పాక్‌ల మధ్య చర్చల వైఫల్యానికి ప్రధాన కారణం ఇరు దేశాల మధ్య ఉన్న అపనమ్మకమే. ఉగ్రవాద శిక్షణ శిబిరాలకు పాక్ స్థావరంగా మారడం, వాటి నిర్మూలనకు పాక్ పాలకులు చిత్తశుద్ధి ప్రదర్శించకపోవడం, ముంబై దాడుల నేపథ్యంలో ఇచ్చిన హామీలను పాక్ నెరవేర్చకపో వడం వంటి కారణాలు ఈ అగాధాన్ని మరింతగా పెంచాయి. మరోవైపు చర్చల ప్రక్రియ పునః ప్రారంభించాలని ఇరుదేశాలపై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. చర్చలకు పాక్ తొందరపడుతున్నా భారత్ ఆచీతూచి వ్యవహరిస్తోంది. ముంబై దారుణానికి కారకుడుగా భావిస్తున్న లష్కరే తొయిబా నేత హాఫీజ్ సయీద్‌ను అప్పగించకుండా సాకులు చెప్పడమే గాక, ఉగ్రవాదంపై ఎలాంటి హామీ ఇవ్వని పాక్‌తో చర్చలు ప్రారంభించడం వ్యూహాత్మక తప్పిదమవుతుందని భారత్‌లోని మేధావుల అభిప్రాయం. గతేడాది రష్యాలో జరిగిన షాంఘై సదస్సులో పాక్ అధ్యక్షుడు జర్దారీతో ప్రధాని మన్మోహన్ చర్చలు జరపడాన్ని భారత్‌లో చాలామంది వ్యతిరేకించారు. పాక్ నుంచి భారత్ లోకి ఉగ్రవాద మూకలు చొరబడకుండా గట్టి చర్యలు తీసు కుంటామనే హామీ ఇవ్వాలని మీడియా ముందే జర్దారీని గట్టిగా అడిగారు. జనవరి చివరివారంలో లండన్‌లో అఫ్ఘాన్ సమస్యపై జరిగిన పలు దేశాల సదస్సులో భారత్ -పాక్ చర్చల ఆవశ్యకతను పలువురు ఉద్ఘాటించారు. ఈ చర్చల ప్రక్రియను పునఃప్రారంభించేందుకు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్రంగా యత్నిస్తున్నారు. భారత్ కూడా సానుకూల సంకేతాలే ఇస్తోంది. ఇరు దేశాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొల్పేందుకు కులదీప్ నయ్యర్ వంటి కొందరు మేధావులు ఇటీవల న్యూఢిల్లీలో ఒక సమావేశాన్ని నిర్వహించారు. చర్చల కోసం ఇరు దేశాల నేతలను ఒప్పించేందుకు అమెరికా రక్షణ మంత్రి రాబర్ట్ గేట్స్ సంప్రదింపులు జరుపుతున్నారు.

## కాశ్మీర్ సమస్య

బ్రిటిష్ పాలన నుంచి విముక్తి లభించే సమయంలోనే భారత ఉపఖండం రెండుగా చీలింది. ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మద్ అలీ జిన్నా ద్విజాతి సిద్ధాంతం ఫలితమిది. ఉపఖండంలో 680 స్వతంత్ర సంస్థానాలు ఉండేవి. అవి తమ ఇష్టానుసారం భారత్, పాకిస్థాన్‌ల్లో విలీనం కావచ్చు లేదా స్వతంత్రంగా ఉండవచ్చునని తేల్చారు. దాంతో కొన్ని పాక్‌లో, మరికొన్ని భారత్‌లో విలీన మయ్యాయి. జునాగఢ్, హైదరాబాద్‌లు సైనిక చర్యతో దేశంలో కలిశాయి. కాశ్మీర్ సంస్థానంపై పాకిస్థాన్ సైన్యం పస్తూను తెగల

సహకారంతో దాడి చేసింది. కాశ్మీర్ పాలకుడు హరిసింగ్ భారత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని సంస్థానాన్ని విలీనం చేశాడు. ఈ లోగా కొంతభాగాన్ని పాక్ ఆక్రమించింది. అదే పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే). దాన్నే ఆజాద్ కాశ్మీర్ అని అంటున్నారు. బ్రిటిష్ పాలకుల సూచన మేరకు ఇరుదేశాలు కాల్పుల విరమణ చేసి సమస్యను ఐరాస ముందుంచాయి. కాశ్మీర్‌లో ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయసేకరణ) నిర్వహించాలని, పీఓకే నుంచి పాక్ సైన్యాన్ని ఉపసంహరించాలని 1949 జనవరి1న ఐరాస తీర్మానించింది. పాక్ సైన్యాన్ని ఉపసంహరించకపోవడంతో ప్లెబిసైట్ నిర్వహణను భారత్ పక్కన పెట్టింది. అలా కొన్నేళ్లు గడిచాయి. 1965లో పాక్ యుద్ధాన్ని భారత్ సైన్యాలు తిప్పికొట్టాయి. తూర్పు పాకిస్థాన్.. బంగ్లాదేశ్‌గా అవతరించడానికి సహాయాన్ని అందిస్తోందనే ఆగ్రహంతో 1971లో భారత్‌పై పాక్ యుద్ధానికి దిగింది. భారత్ పైచేయి సాధించింది. తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించింది.. 90 వేల మంది పాక్ సైనికులు బందీలుగా చిక్కారు. ఈ నేపథ్యంలో 1972లో జరిగిన సిమ్లా ఒప్పందంపై పాక్ తరపున భుట్టో, భారత్ ప్రధాని ఇందిరా గాంధీ సంతకాలు చేశారు. కాశ్మీర్ సహా అన్ని సమస్యలను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

### ఉగ్రవాదానికి ఊతం:

పాక్‌లో సుస్థిర ప్రజాస్వామ్యం లేకపోవడం, సైనిక నియంతృత్వాలు తలెత్తడంతో రెండు దేశాల మధ్య సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అంతర్జాతీయ వేదికల మీద పాక్ తరుచుగా ప్లెబిసైట్ వాదనను వినిపిస్తోంది. ఐరాస తీర్మానం నాటి పరిస్థితులు లేవని దీన్ని భారత్ తోసిపుచ్చుతోంది. దీంతో పాక్ పాలకులు భారత్‌ను అస్థిరపరిచేందుకు ఉగ్రవాద ఆయుధాన్ని ఎక్కుపెట్టారు. కాశ్మీరులో అగ్నిగుండం రగిల్చారు. హిజ్‌బుల్ మొజాహిద్దీన్, లష్కరే తొయిబా, జైష్ ఎ మహమ్మద్, హర్కతుల్ అన్సార్, జేకే ఎల్‌ఎఫ్, హురియత్ కాన్ఫరెన్స్ వంటి ఉగ్రవాద సంస్థలు మొత్తం 22 పాక్ స్థావరంగా భారత్‌లో శాంతికి భగ్నం కలిగిస్తున్నాయి. 1999లో కార్గిల్ యుద్ధం తర్వాత 2001లో వాజ్‌పేయి, ముషారఫ్ మధ్య ఆగ్రాలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. అదే ఏడాది డిసెంబర్ 13న పార్లమెంటుపై పాక్ టెర్రరిస్టులు దాడి చేశారు. 2006-08 మధ్య కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో 13 దాడులు జరిగాయి. మన్మోహన్ సింగ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. 2005లో పాక్‌లో భూకంపం వస్తే భారత్ సాయం చేసింది. ఓ వైపు చర్చలు జరుపుతూనే దేశంలో దాడులకు పాక్ పాలకులు ప్రేరేపించారు. దానికి పరాకాష్టే 2008 ముంబై నరమేథం. నాటి నుంచి సంబంధాలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఉగ్రవాదం ఎంతగా కోరలు చాస్తున్నదో అనడానికి తాజా ఉదాహరణ అమెరికా పౌరుడు డేవిడ్ కోల్‌మెన్ హ్యాడ్లీ ఉదంతమే. తహపూర్‌రాణా అనే పాకిస్థానీతో చేయి కలిపి భారత్‌లో విధ్వంసానికి కుట్రపన్నాడు. ముంబై మారణహోమానికి ఇతనే సూత్రధారిగా అనుమానిస్తున్నారు. దేశమంతా తిరిగి విధ్వంసానికి పథకం రూపొందించిన హ్యాడ్లీ అమెరికాకు పట్టుపడడంతో ప్రమాదం తప్పింది. వరల్డ్ వైడ్

ఇన్సిడెంట్ ట్రాకింగ్ సిస్టం(విట్స్) నివేదిక ఉగ్రవాదం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య సోమాలియా తర్వాత భారత్‌లోనే ఎక్కువని పేర్కొంది.

## సియాచిన్ హిమనీనదం:

సియాచిన్ హిమనీనదం ప్రపంచంలోకెల్లా ఎత్తైన యుద్ధ భూమి. సముద్ర మట్టానికి 6000 మీటర్ల ఎత్తులో 76 కిలో మీటర్ల పొడవు, 8 కిలోమీటర్ల వెడల్పుతో ఇరుదేశాలకు కీలక ప్రాంతంలో ఉంది. అఫ్ఘానిస్థాన్, తజకిస్థాన్, చైనా, పాక్ అధీనంలోని నార్తర్న్ టెరిటరీస్‌లోని గిల్‌గిట వగైరాలు దీనికి దగ్గరలో ఉన్నాయి. తూర్పున కారకోరం పర్వ తశ్రేణులు, దక్షిణాన లడక్‌లోని లే పట్టణం ఉన్నాయి. కార్గిల్ – లే మధ్యలో కొద్ది దూరంలోనే సియాచిన్ ఉంది. కార్గిల్‌కు ఉత్తరంగా వాస్తవాధీన రేఖ ఉంది. 1984లో దీనిపై వివాదం ప్రారంభమైంది. 1985, 87, 95లో రెండు దేశాల సైన్యాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఉభయ దేశాల మధ్య అనేక రౌండ్ల చర్చలు జరిగినా ఫలితం దక్కలేదు.

## సర్‌క్రీక్ వివాదం:

గుజరాత్‌లోని రాణ్ ఆఫ్ కచ్ చిత్తడి భూమిలో 60 మైళ్ల పొడవున్న సర్‌క్రీక్ కయ్య వివాదానికి కేంద్రమైంది. ఇది సింధ్ రాష్ట్రానికి, ఇటు గుజరాత్‌కు సరిహద్దులో ఉంది. ఇటువంటి నీటి కయ్యల దిశ అప్పుడప్పుడు మారుతూ ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాల (థల్వాగ్ సిద్ధాంతం) ప్రకారం నీటికయ్య మధ్యగా సరిహద్దు నిర్ణయించవచ్చు. పాక్ మాత్రం 1914 బొంబాయి ప్రభుత్వ తీర్మానం మేరకు మొత్తం క్రీక్ ప్రాంతమంతా తనదేనని వాదిస్తోంది. సింధ్ ప్రభుత్వానికి, కచ్ మహారాజుకు మధ్య జరిగిన ఆ తీర్మానం క్రీక్ ప్రాంతాన్ని సింధ్‌లో భాగంగా పేర్కొంటోంది. బ్రిటిష్ ప్రధాని హరాల్డ్ విల్సన్ ఉభయులతో చర్చించి సమస్య పరిష్కారానికి ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఒప్పించారు. అది 1968లో తీర్పునిచ్చింది. దాని ప్రకారం ఈ ప్రాంతంలో పాక్‌కు పదిశాతం భూభాగమే దక్కింది. దాన్ని కూడా పాక్ తోసిపుచ్చింది. చమురు, సహజవాయువు నిక్షేపాలు పుష్కలంగా ఉండడంతో పాక్ దీనిపై పట్టుపడుతోంది.

## జల వివాదం:

భారత్, పాక్ ప్రధాన సమస్యల్లో జలవివాదం ఒకటి. దేశ విభజన తర్వాత సింధునది నీటి వినియోగంపైనా వివాదం తలెత్తింది. హిమాలయాల్లో ప్రారంభమైన 'సింధు' రెండు దేశాల్లో 26 లక్షలకు పైగా ఎకరాలకు నీటిని అందిస్తూ అరేబియా సముద్రంలో కలుస్తోంది. దీనిపై తొలుత 1948లో వివాదం తలెత్తగా తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. వార్షిక చెల్లింపుల ప్రాతిపదికన పాక్‌కు తగినంత నీటి విడుదలకు భారత్ అంగీకరించింది. శాశ్వత పరిష్కారానికి శాంతియుత చర్చలు జరపాలని నిర్ణయించాయి. ఆ తర్వాత సమస్యను అంతర్జాతీయ న్యాయ స్థానంలో పరిష్కరించుకోవాలనే పాక్ వాదనను భారత్ తిరస్కరించింది. 1951లో అమెరికా అణుశక్తి కమిషన్ మాజీ చైర్మన్ డేవిడ్ లిలియంథల్

అధ్యయనం చేసి కాశ్మీర్ సమస్యతో ముడిపెట్టకుండా దీన్ని చర్చల ద్వారా పరిష్క రించుకోవాలని సూచించారు. ప్రాజెక్టులు, కాలువలు నిర్మించడం వల్ల రెండు ప్రాంతాలకు సమృద్ధిగా నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నాడు. పలు రౌండ్ల చర్చల తర్వాత 1960లో ఇరుదేశాల ప్రధానులు ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం పశ్చిమంగా ప్రవహించే సింధు, జీలం, చీనాబ్ నదీ జలాలను పాక్; తూర్పునకు ప్రవహించే రావి, సట్లెజ్, బియాస్ నదీ జలాలను భారత్ వాడుకోవాలి. తూర్పు నదుల నుంచి వచ్చే నీటి హక్కును కోల్పోయినందుకు పాక్‌కు భారత్ నష్టపరిహారం కూడా ఇచ్చింది. ఐనప్పటికీ కొన్ని పరిమితులకు లోబడి పశ్చిమ నదుల జలాలను వినియోగించుకునే హక్కు భారత్‌కు, తూర్పు నదుల నీటిని వాడుకునే హక్కు పాక్‌కు ఉంది. ఆమేరకు జీలం నదీ జలాలను వ్యవసాయ, గృహావసరాలకు ఉపయోగించుకునేందుకు భారత్ యత్నిస్తోంది. ఇదే సమస్యకు కారణ మైంది. సింధు నది కాలువలు కొన్ని భారత భూభాగం నుంచి వెళ్తున్నాయి. ఈ నీటిని మన రైతులు అక్రమంగా ఉపయోగించుకుంటున్నారని పాక్ ఆరోపణ. దీంతో ఇరు దేశాలకు ఉపయోగపడేలా కొన్ని ప్రాజెక్టులను భారత్ ప్రతిపాదించింది. వాటిలో తుల్‌బుల్ ప్రాజెక్టు ప్రధానమైంది. దీన్ని పాకిస్థాన్ ఊలార్ ప్రాజెక్టు అని పిలుస్తోంది. జీలం నదిపై ఊలార్ సరస్సుకు దిగువన కట్టే ఈ ప్రాజెక్టు వల్ల తమ ప్రాంతంలోని నదిలో నీటిమట్టం తగ్గిపోతుందని, నౌకాయానానికి ఇబ్బంది కలుగుతుందని పాక్ అభ్యంతరం పెడుతోంది. సోపూర్–బారాముల్లా మధ్య 20 కిలోమీటర్ల దూరం నౌకాయానానికి ఎటువంటి ఇబ్బందిలేకుండా నీటి ప్రవాహాన్ని నియంత్రిస్తామని భారత్ పేర్కొంటుంది. ఇరు దేశాల నాయకులు, నిపుణులు కలసి ఒక నమూనా ఒప్పందాన్ని తయారుచేసినా ఆమోదానికి నోచుకోలేదు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు వల్ల ఏడాది పొడవునా నౌకాయానం కొనసాగుతుంది. ఇప్పుడు వేసవిలో నౌకాయానం ఆగిపోతోంది. వర్షాకాలంలో నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టు పూర్తిచేసి నీటి ప్రవాహాన్ని నిర్దిష్ట ప్రమాణంలో నియంత్రిస్తే నౌకాయానానికి ఆటంకం ఉండదు.

### చర్చలపై సంకేతాలు:

భారత్–పాక్ మధ్య మళ్లీ చర్చల ప్రక్రియ ప్రారంభమయ్యే సంకేతాలు, సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇందుకు అమెరికా ఒత్తిడి తీవ్రంగా ఉంది. రెండు దేశాల సహకారంతోనే అఫ్ఘాన్ సమస్యను ఓ కొలిక్కి తీసుకురావడం సాధ్యమవుతుందని భావిస్తున్న ఒబామా ఇందుకు శతథా ప్రయత్నిస్తున్నారు.

## నాలుగు యుద్ధాలు

దక్షిణాసియాలో రెండు పెద్దదేశాలైనా భారత్, పాక్‌ల మధ్య స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి పోరు సాగుతూనే ఉన్నా.. నాలుగు యుద్ధాల్ని మాత్రం ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా ఈ యుద్ధాలన్నిటికీ సైనిక ఘర్షణలు, ఉగ్రవాద చొరబాట్లు, సరిహద్దు వివాదాలే కారణాలు. ఆ యుద్ధాలు...

- **1947:** ఈ ఏడాది అక్టోబర్‌లో తొలిసారి రెండు దేశాల మధ్య యుద్ధం జరిగింది. దీనిని మొదటి కాశ్మీర్ యుద్ధంగా వర్ణిస్తారు. 1948 ఏప్రిల్ 21న ఐక్యరాజ్య సమితి చేసిన 47వ తీర్మానంతో ముగిసింది. ఈ క్రమంలో పీఓకే ప్రాంతాలు (ఉత్తర, పశ్చిమ), భారత్ అధీనంలోని ప్రాంతాలు (దక్షిణ, మధ్య, ఈశాన్య) వాస్తవాధీన రేఖను ఐరాస ఏర్పాటు చేసింది.
- **1965:** ఆపరేషన్ జీబ్రాల్టర్ పేరిట.. కాశ్మీర్‌లోకి పాక్ సైన్యాన్ని పంపడంతో రెండోసారి యుద్ధం జరిగింది. తాష్కెంట్ ఒప్పందంతో ముగిసింది.
- **1971:** బంగ్లాదేశ్ విమోచన కోసం భారత్ జోక్యం నేపథ్యంలో ఈ యుద్ధం జరిగింది.
- **1999:** పాక్ సైన్యం వాస్తవాధీన రేఖను దాటడంతో కార్గిల్ యుద్ధం జరిగింది.